# ఈ అనుభవం చాలు

**వందం రామారావు**

జీవితంలో ఎన్నో సంఘటనలు జరుగుతూ వుంటాయి కొన్ని జ్ఞాపకముంటాయి, కొన్ని జ్ఞాపకముండవు. కొన్నింటిని మరచిపోవాలన్నా మరచిపోలేం.

మనకు తెలియకుండానే, మన ప్రమేయం లేకుండానే కొన్ని సంఘటనలు చకచకా జరిగిపోతూ వుంటాయి. అవి ఎదుటివారిని బాధించకుండా వుంటే చాలు. కొన్ని సంఘటనలు మనలో నిక్షిప్తమై వుంటాయి. వాటిని ఎదుటివారికి చెప్పుకోలేం. చెప్పుకోవాలని కూడా అనిపించదు. ఆ జ్ఞాపకాల పొరలు ఒకోసారి మనల్ని అప్రయత్నంగా పలుకరిస్తూ వుంటాయి. అదిగో అటువంటిదే ఈ కథ.

"ఏవండీ పెళ్లాంగారు... మిమ్మల్నే!"

"ఏమి నాథా! ఏమి నీ కోరిక?"

"అందమైన మగాడ్ని చురుకైన యువకుడ్ని పట్టుకుని 'నువ్వు' అనడం ఏంబావుండలేదు. ఇది మా జాతికే అవమానం. అంచేత నీకు శిక్ష వేయకతప్పదు" అంటూ భార్య రేఖ చేతిని పట్టుకోబోయాడు బాలరాజు.

టేబుల్ మీద టిఫిన్ సర్దడంలో వున్న రేఖ, భర్తకు దొరక్కుండా కొంచెం వెనక్కి జరిగి, "ఏవిటి విషయం చాలా జోరుగా వుంది" అంది నవ్వుతూ.

"ఇవేళ తారీఖు ఎంతో తెలుసా? పద్నాలుగు. ఒకటీ నాలుగూ కలిస్తే పదిహేను. అట్లాగే ఒక మగా, ఒక ఆడ కలిస్తే రెండు!!"

ఆ మాటకి రేఖ పకపకా నవ్వేసింది. "మీకెవరండి డైరెక్టుగా ఆఫీసరు పదవిచ్చింది! మీకు ఎక్కాలు కూడా రావనే విషయం ఇప్పుడే తెలిసింది. ఒక మగా, ఒక ఆడ కలిస్తే రెండు కాదు ఒక్కటే...!" అంటూ మరోసారి నవ్వేసి భర్తకేసి కన్నుగీటింది.

"నిన్ను చేసుకున్న తర్వాతనే నేను చవటనయ్యాననే విషయం తెలుసుకున్నాను. ఇప్పుడలా కాకుండా వుండడం కోసం తొందరలోనే 'టూ టౌన్' ఏర్పాటు చేసుకోబోతున్నాను" అంటూ బాలరాజు టిఫిన్ తినసాగాడు.

రేఖ, భర్తకెదురుగా కూర్చుని చేతులు టేబుల్ మీద ఆన్చి ప్రేమగా చూడసాగింది.

పనిమనిషి పారిజాతం వాష్ బేసిన్ దగ్గర నిలబడి ప్లేట్లు కడుగుతోంది.



పారిజాతానికి ఆ భార్యా భర్తల సంభాషణ వినాలంటే చాలా కుతూహలం వారెప్పుడూ సరదాగా ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ గడిపేయడం ఆమెకు సంతోషంగా వుంటుంది.

ఇంట్లో పనిమనిషి వున్నదనే ధ్యాస కూడా లేకుండా, బాలరాజు ఏవేవో బూతు మాటలు కూడా మాట్లాడుతాడు. ఆ మాటలు వింటూ రేఖ సంతోషపడిపోతో, సిగ్గుపడిపోతూ, భర్తని మెత్తమెత్తగా చీవాట్లు పెడుతూ వుంటుంది. ఈ తంతు ఆ ఇంట్లో రోజూ జరిగేదే!

"అబ్బ! ఏవిటలా సైలెంట్ అయిపోయావ్? టూ టౌన్ పెడతానని భయమేసిందా? ఛ...ఛ...! ఇంతందమైన భార్య వుండగా మరొకతె నాకెందుకే? ఊరికే సరదాగా.. నిన్ను వుడికించాలని... ఈ వయస్సులో ఇంకా నీ అందం చెక్కు చెదరలేదంటే..."

"ఉష్.." అంటూ రేఖ పెదవికి చెయ్యి అడ్డు పెట్టి భర్తకు సైగ చేసింది.

అప్పటికి టిఫిన్ పూర్తి చేసిన బాలరాజు, తలెత్తి చూశాడు.

ఎదురుగా పారిజాతం వీరి సంభాషణే జాగ్రత్తగా వింటూ ఆనందపడిపోతోంది. తనను భార్యాభర్తలిద్దరూ గమనిస్తున్నారని తెలిసి, మెల్లగా అక్కడ్నుంచి కదిలి మరో గదిలో కెళ్లింది.

"ఇదిగో, ఇవేళ పెందలాడే వచ్చేస్తా. రాత్రిలా వూరికే నస పెట్టకు. ఇవేళ చాలా భారీ కార్యక్రమం వుంది."

"భారీ కార్యక్రమమా? ఎక్కడండి?"

"ఎక్కడేంటి మనింటి దగ్గరే!"

"ఉపన్యాసకులున్నారా?"

"ఒక మంత్రి గారిని, నలుగురు ఎమ్మెల్యేలను, ఐదుగురు నాట్యకత్తెలను పిలిచి గానా బజానా పెట్టిస్తున్నా. చాలా? ఇదిగో రేఖా! ముందే చెబుతున్నా. రాత్రికి గదిలో అన్నీ సిద్ధం చెయ్!" అంటూ బాలరాజు లేచి భార్య దగ్గర కొచ్చి, అటూ ఇటూ చూసి, గభాల్న భార్య చెంపల్ని తాకి, తలని ముందుకు వొంచి, పెదవుల మీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

"అబ్బా! మీరు రాను రాను మరీ ఇద్దైపోతున్నారు. ఇంత వయసొచ్చినా మీకిదేం పని?" అంది, మనస్సులో ఆనందపడుతూనే పైకి మాత్రం గంభీరంగా.


"ఇదిగో చూడు రేఖా! యాభై ఏళ్లకే ముసలాళ్లమైనట్టుగా పోజు కొట్టకు! ఇప్పుడు వున్నదంతా ఈ వయస్సులోనే"

అంటూ మరో సారి భార్యను ముద్దు పెట్టుకోబోయాడు.

అదిగో, సరిగ్గా అటువంటి సమయంలోనే పారిజాతం "అమ్మ గారూ!" అంటూ లోపలకొచ్చి, ఆదృశ్యం చూసి సిగ్గుపడిపోయి పరిగెత్తికెళ్ళిపోయింది హాల్లోకి.

0 0 0

బాలరాజు వయస్సు యాభై దాటినా అంత వయసు వున్నట్లుగా కనిపించడు. ఎర్రగా, బలంగా, సదా ముఖం మీద చిరునవ్వుతో ఆకర్షణీయంగా వుంటాడు. అతనికి భార్య రేఖ అంటే ఎంతో ఇష్టం. పెళ్లయి పాతికేళ్లు దాటినా ఎన్నడూ ఎడముఖంగా వుండలేదు. ఎక్కడికెళ్లినా ఇద్దరూ కలిసే వెళ్లేవారు. రేఖ కూడా అందంగా, నాజూగ్గా సాయంత్రపు వేళలో విచ్చిన మల్లెపువ్వులా వుంటుంది. ఇక, పారిజాతం ఆ ఇంటికి పనిమనిషిగా వచ్చి ఆ రేళ్లు దాటింది. అందమైన ఇంటికి అందమైన పనిమనిషి అన్నట్లుగా పారిజాతం నిజంగానే పారిజాతంలా వుంటుంది. వయస్సు ముప్పై సంవత్సరాలుంటాయి. ముచ్చటగా వున్న పారిజాతాన్ని ముద్దుగా చూసుకోలేని మొగుడున్నాడు. వాడొట్టి వెధవని వేరే చెప్పనక్కర్లేదు! కానీ బాలరాజు అంటే పారిజాతానికి ఎంతో ఇష్టం.



ఏవేవో ఆలోచించుకుంటూ బ్రష్‌తో కార్పెట్ శుభ్రం చేస్తున్న పారిజాతం, రేఖ పిలుపుతో పని ఆపి ఆమెకెదురుగా నిలబడింది.

"చూడు పారిజాతం! బెడ్ రూమ్ కాస్త దులుపు. ఇవేళ నాకు నలతగా వుంది. పని చేసుకోలేకపోతున్నాను. అయ్యగారొచ్చారంటే గయ్ మంటారు."

పారిజాతం తలూపి, బెడ్ రూమ్ దగ్గర కొచ్చింది.

ఆ గది తలుపు దగ్గరకే సుంది. నెమ్మదికా తలుపు తోసి గదిలోకి తొంగిచూసింది. గుప్పున చాప్లీ సువాసనలు గుబాళించాయి. అడుగులో అడుగు వేసుకుంటూ లోపలకెళ్లింది. ఒక్కసారి ఆ గదిని ఎంతో తన్మయత్వంతో చూపింది. ఎదురుగా వున్న బెల్జియం నిలువుపాటి అద్దంలో తన అందాన్ని చూసుకుని మురిసిపోయింది. డబుల్ కాట్ బెడ్ షీట్‌ను దులిపి సరిచేసింది. గోడకు వేలాడుతున్న ఫోటోలకేసి చూసి ముచ్చట పడింది. ఫ్లవర్ వాజ్‌లో కొత్తగులాబీలు సర్దింది. ఆ గది అందం మరోసారి చూసుకుని ఎన్నో ఊహల అనుభూతులతో సిగ్గుపడిపోయింది. ఎందుకో.. ఎందుకో... చెప్పలేని తన్మయత్వంతో నెమ్మదిగా వెళ్లి మెత్తని డన్‌లప్ పరుపు మీద వాలింది. కళ్లు బరువుగా వాలిపోతుండగా, హాల్లో బాలరాజు మాట వినబడ్డంతో, పారిజాతం బెడ్ మీద నుంచి దిగ్గున లేచి గబగబా ఆ గదిలోంచి బయట కొచ్చింది.

0 0 0

సడి లేని రాత్రి.

గదిలో చల్లగా వుంది.

మెత్తని పరుపు మీద ఇద్దరి శరీరాలు వెచ్చగా వున్నాయి

వారి ఊపిరి అగ్గిపుల్ల వెలిగించినంత వెచ్చగా, చురుగ్గా వున్నాయి.

ఆ గదిలో చిన్న పాటి వెలుతురు మాత్రం ఒకరినొకరు చూసుకునే పాటిదిగా వుంది.

ఆ ఇద్దరూ ఎవరో ఈ పాటికి మీకు తెలిసే వుంటుంది.

బాలరాజు రేఖను దగ్గరకు తీసుకుని "ఎలా వుంది డియర్?" అన్నాడు.

"ఛా! ఏం బాగా లేదు" అన్నది రేఖ నవ్వుతూ

'పోనీ... మరోసారి...' నవ్వుతూ అన్నాడు

"చాలా హాపీగా వుంది. ఇప్పుడేం వద్దు. అయినా, మీకెప్పుడూ ఇదే యావా? ఇంత వయస్సు వచ్చిన తర్వాత కూడా ప్రతి రోజూ ఇదేనా?"

"ఇదేనా? అంటే...?" బాలరాజు నవ్వుతూ అడిగాడు.

"ఇదే!" అంట రేఖ, భర్తని గట్టిగా కౌగిలించుకుంది.

"ఇదిగో అల్లరి పిల్లా! మనకు పిల్లలు లేకపోయినా నీకు నేను, నాకు నువ్వు మనిద్దరితో నే మనకు సమస్తం. ఓ పని చేద్దాం..." బాలరాజు మాట పూర్తి కాకుండానే రేఖ అడ్డుతగిలి, 'ఏవండీ, నాకు తెలియకడుగుతానూ, మనలాగానే అందరూ ఈ వయసులో ఇలాగే వుంటారా?"

"ఏం అనుమానంగా వుందా? పోనీ ఓ పనిచెయ్. నేను ఆఫీసుకెళ్లగానే నీకేం తోచడం లేదంటావ్ గదా. ఎంచక్కా ప్రతి ఇంటికీ వెళ్లి మన వయస్సులో వున్నవారిని సంకోచం లేకుండా మన విషయం చెప్పి, మీరు కూడా ఇలాగే వుంటారా? అని సర్వే చెయ్, నీకు గొప్ప పేరొస్తుంది" అని బాలరాజు, భార్య వీపు మీద చెయ్యేసి, చెవి దగ్గర ఏదో గుసగుసలాడాడు.

బాలరాజు గుసగుసలకు, రేఖ గుక్క తిప్పుకోకుండా నవ్వసాగింది. నవ్వి నవ్వి ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"ఛీ! మీరు రాను రాను మగీ పేట్రేగిపోతున్నారు. మీకు సెక్స్‌శ్రీ అని బిరుదిస్తే సరిపోతుంది' అంటూ మళ్లీ నవ్వింది.

"నాకైతే ఆ బిరుదు నిచ్చావ్ బాగానే వుంది. మరి నీకేం బిరుదునివ్వాలి?" అంటూ బాలరాజు, భార్యను గట్టిగా తన చేతులతో

ఇంతలో రేఖ పెద్దగా ఆర్తనాదం చేస్తూ 'అమ్మా' అంటూ స్పృహ తప్పి పడిపోయింది.

**(మిగతా వచ్చేవారం)**